

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనాలి : సీతారాం

ప్రజాశక్తి - పెనుమంట్ర

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పొలమూరులో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, గోనెసంచుల కొరత లేకుండా చూడాలని, తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్ ధాన్యం రూ.1530కు కొనుగోలు చేయాలన్నారు. తూకాల్లో రైతులను మోసం చేస్తున్నారని, పారదర్శకంగా కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోపాలన్, పొలమూరు గ్రామ శాఖ కార్యదర్శి రాపాక ఆశీర్వాదం, చింతపల్లి తిరుపతిరావు, రైతులు సారెపల్లి గోపీ, బి.శ్రీనివాస్, పి.సత్యనారాయణ, రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

అనాధికారిక వసూళ్లకు పాల్పడిన తొమ్మిది మిల్లులు సీజ్
రూ.713 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు
21 రోజుల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ
అందుబాటులో సరిపడా గోనె సంచులు
సమస్యల సత్వర పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'
సన్నద్ధమైన అధికారులు
ఇప్పటికే 6216 ఫిర్యాదులు నమోదు
విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి


మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కొనుగోలులో రైతుల నుంచి అనాధికారిక వసూలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ఇప్పటికే తొమ్మిది రైస్ మిల్లులను సీజ్ చేశామని, తీరుమారకపోతే క్రిమినల్ యాక్షన్‌లోకి వెళ్తామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ, జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇ-క్రాప్ డేటా ఆధారంగా 2 లక్షల 43 వేల ఎకరాల్లో వరిసాగు చేశారని, ఇప్పటి వరకూ లక్షా 50 వేల ఎకరాల్లో మాసూలు పూర్తయిందన్నారు. పది రోజుల్లో మిగిలిన పంట మాసూలు పూర్తవుతుందని చెప్పారు. 6.4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం తీసుకోగా ఇప్పటివరకూ 3.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రూ.340 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మిగిలిన ధాన్యం డబ్బులు మరో రెండు రోజుల్లో జమవుతాయన్నారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు, రైస్ మిల్లర్ల అనధికారిక వసూలు, నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు సమస్యలపై రైతుల నుంచి ఇటీవల ఫిర్యాదులు అందాయని వీటి ఆధారంగానే జిల్లాలో తొమ్మిది రైస్ మిల్లులను సీజ్ చేశామన్నారు. పాలకొల్లులో రంగరాజు, శక్తి రామ్ రైస్ మిల్లులు, తణుకులో లక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిలు, పెనుగొండలో నవ్య కృష్ణా రైస్ మిల్లు, గణపవరంలో సారధి సాయినాథ్ రైస్ మిల్లు, ఇరగవరంలో వెంకటలక్ష్మి, విజయ ఫుడ్ ప్రొడక్ట్ రైస్ మిల్లులు, ఆకివీడులో పద్మజ సూపర్ ఫుడ్స్ రైస్ మిల్లు, తాడేపల్లిగూడెంలో నిర్మల రైస్‌మిల్లు సీజ్ చేస్తామన్నారు. జిల్లాలో 200 రైస్ మిల్లుల్లో సీసీ కెమెరాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యలుంటే 8121676653 నెంబర్‌ను సంప్రదించాలి


జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశామని, రైతు భరోసా కేంద్రంలో సైతం ప్రత్యేక కమిటీలున్నాయని, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా నిరంతరం పనిచేస్తున్నారని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను, రైస్ మిల్లులను జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించారని రామ్‌సుందర్ రెడ్డి పరిశీలించారని పేర్కొన్నారు. ప్రత్యేక అధికారులు నాలుగు రోజుల పాటు మండల కేంద్రాల్లోనే ఉండి ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తున్నారన్నారు. కొనుగోలులో ఇబ్బంది ఏర్పడితే రైతులు 8121676653 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో గోనె సంచులు

జిల్లాలో గోనె సంచుల కొరత లేదని, సరిపడా సంచులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. ధాన్యం కొనుగోలుకు కోటి 60 లక్షల గోనె సంచులు అవసరమని అంచనా వేశామన్నారు. దీనిలో కోటి 30 లక్షలు సంచులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మరో 24 లక్షల సంచులు ఆర్‌బికెల వద్ద, 20 లక్షలు రైస్ మిల్లు వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

'జగనన్న చెబుదాం'లో 6216 ఫిర్యాదులు నమోదు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టిందని, కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. జిల్లాలో బుధవారం నుంచి అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న అధికారులంతా ఈ కార్యక్రమం నిర్వహణకు సంసిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆరు నెలలపాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అధికారులంతా కసరత్తు చేసి భాగస్వాములయ్యామన్నారు. ఈ కాలంలో ప్రజల నుంచి 6216 ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు చేశామని చెప్పారు. ఇరిగేషన్ కాలవలు, గట్ల వెంబడి ఇల్లు నిర్మాణం, గ్రామకంఠం సమస్యలపై ఫిర్యాదులు అధికంగా అందాయన్నారు. ప్రతీ సోమవారం స్పందన యధావిధిగా అన్ని స్థాయిల్లో జరుగుతుందన్నారు. సమస్యలు మరింత మెరుగ్గా పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం నిర్వహిస్తున్నారని, అవసరమైన వారు 1902 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని కోరారు. సమస్య జగనన్నకు చెబుదాంలో రిజిస్టర్ అయ్యాక 24 గంటల్లో సంబంధిత సమస్యపై సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతోపాటు విచారణ జరిపి సమస్య పరిష్కరించబడుతుందన్నారు. అలాగే ఫిర్యాదు చేసిన సంబంధిత వ్యక్తికి కూడా ఫోన్ చేసి సమస్య పరిష్కారం పట్ల సంతృప్తి చెందారా అని అడుగుతారని వివరించారు. సచివాలయ వ్యవస్థ నుండి వివిధ శాఖల అధికారులంతా బాధ్యతగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సమావేశంలో జెసి రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారమివ్వాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - భీమవరం

అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. భీమవరం యుటిఎఫ్ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించిందని, దాన్ని వెంటనే రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించి ఉంటే చాలావరకూ నష్టం తగ్గేదన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో అలసత్యం వహించారని పేర్కొన్నారు. గోనె సంచులు ఇవ్వడంలో రైతులను ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. భూ సర్వే విషయంలో కూడా రైతుల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. జిల్లాలో చుక్కల భూములను గుర్తించి ప్రకటించాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ జిల్లాలో 40 కేజీల బస్తాకు 42 కేజీల ధాన్యం తూకం పెట్టాలని ప్రకటించడాన్ని తప్పుబట్టారు. ఎకరం ధాన్యానికి వంద కేజీల వరకూ అధికంగా ఇవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ గోకులం షెడ్లు నిర్మించిన బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు చీర్ల పుల్లారెడ్డి, గుత్తుల శ్రీనివాస్, కిలారి తవిటి నాయుడు, యాతం రాంబాబు, తాళ్లూరి హరిహర, లక్ష్మణ్, అయినంపూడి బాబూరావు, యాళ్లబండి నారాయణమూర్తి, బొర్రా అలమహరాజు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు, ఆశయాలు ఆదర్శం

సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - వీరవాసరం

అమరవీరుల త్యాగాలు, వారి ఆశయాలు ఆదర్శమని, వాటిని వృథాకానివ్వబోమని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. కలిదిండి స్యూనారాయణరాజు, పేరంటాలు వర్ధంతి సందర్భంగా బుధవారం బుధారాయుడు చెరువు సమీపంలోని సూర్యనారాయణరాజు స్తూపం వద్ద వీరవాసరం, పెనుమంట్ర మండలాలకు చెందిన సిపిఎం నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంతెన సీతారాం మాట్లాడుతూ దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందన్నారు. వారికి అధికారం ఇస్తే సత్తా ఏంటో చూపిస్తారని, ఇందుకు ఉదాహరణ కేరళ, చైనా అంటూ ఆయన ఉదహరించారు. తమకు అధికారం ఇస్తే పేదరికాన్ని రూపుమాపడం, సంపద సృష్టించడం దాన్ని పంచడమే సిద్ధాంతమన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సగంసగం అమ్మితే నేడు అధికారంలో ఉన్న బిజెపి దేశాన్ని గుత్తగా అమ్మేస్తుందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్లు అంబానీ, అధానీలకు కట్టబెటుతుందని విమర్శించారు. ఇలాంటి బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు మద్దతు తెలుపుతున్నాయని, ఇది దురదృష్టకరమన్నారు. ఢిల్లీలో సిపిఎంకు బలంలేకపోయినప్పటికీ బిజెపిని ప్రశ్నిస్తూ సవాలు విసురుతున్నది సిపిఎం మాత్రమేనని ఈ దేశ ప్రజలు గుర్తించాలన్నారు. కొంత మంది ఎర్రజెండా కనిపించడంలేదంటూ మాట్లాడుతున్నారని, ఈ లెక్కన రాష్ట్రంలో కాంగ్రెస్ ఒక్క సీటుకూడా గెలవలేదని అంటే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ లేనట్టా అని ప్రశ్నించారు. ఒక ప్రాంతంలో బలహీన పడటం మరో ప్రాంతంలో బలపడటం తాత్కాలికమేనన్నారు. కమ్యూనిస్టుల వల్లే అద్భుతాలు సాధ్యమవుతాయన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఉపశమనమేనన్నారు. పరిశ్రమలు లేకుండా ఇదే అభివృద్ధి అంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. సిపిఎం విధానాలను, ఇతర పార్టీల విధానాలు పరిశీలించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి, కేతా గోపాలన్, వీరవాసరం, పెనుమంట్ర, కార్యదర్శులు పోతుల మృత్యుంజయ, కె.సుబ్బరాజు, జుత్తిగ సాంబియాంబ, తాళ్లూరి రాము, రాపాక ఆశీర్వాదం, కేతా జ్యోతిబసు, యాళ్లబండి నారాయణమూరి పాల్గొన్నారు.


అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కెఎన్ రోడ్డుకు వైఎస్ఆర్ మార్గ్‌గా నామకరణం

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంతవరకూ కెఎన్ రోడ్డుగా వాడుకలో ఉన్న కోడేరు, నల్లజర్ల రోడ్డుకు వైఎస్ఆర్ మార్గ్‌గా నామకరణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. తాడేపల్లిగూడెంలో రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చారిత్రాత్మకంగా అభివర్ణించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాకు తలమానికమైన తాడేపల్లిగూడెం ప్రాముఖ్యతను మరింత పెంచేలా ముఖ్యమంత్రి రెవెన్యూ పోలీసు డివిజన్లు మంజూరు చేయడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పరిపాలనా పరమైన పనుల కోసం ఇక్కడ ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆర్‌డిఒ, డిఎస్‌పి కార్యాలయాలు అందుబాటులోకి తీసుకొచ్చి ఒక కానుకగా ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇరిగేషన్ ఇఇ కార్యాలయంతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల డివిజన్ కార్యాలయాలు కూడా ఏర్పాటు కాబోతున్నాయన్నారు.

'ఉపాధి' చట్ట పరిరక్షణలో బిజెపి విఫలం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


తాడేపల్లిగూడెం మండలంలో..

బిజెపి అధికారం చేపట్టినప్పటి నుంచి ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తూ వస్తోందని, చట్ట పరిరక్షణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ వి మర్శించారు. ఉపాధి హామీ చట్ట పరిరక్షణ ఆటో ప్రచార యాత్రను ఆయన సత్యనారాయణ బుధవారం మండలంలోని ఇటుకలగుంటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఉపాధి చట్టాన్ని నీరుగారుస్తూ వస్తుందన్నారు. ఈ ఏడాది ఉపాధి హామీకి భారీగా నిధులు తగ్గించిందని, ఉపాధి హామీని కాపాడుకోవడానికి కూలీలు ఐక్యతతో ఉపాధి హామీ చట్టం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ నెల 12వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాలో కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన ఆటో యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. మెట్ట ఉప్పరగూడెం, చిన తాడేపల్లి, కడియద్ద, జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం, జగన్నాధపురం, నవాబుపాలెం, నందమూరు, మారంపల్లి గ్రామాల్లో యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి పాలుపూరి సత్యనారాయణ పాల్గొన్నారు.


పెనుమంట్ర మండలంలో..

పెనుమంట్ర: ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లుపొడుస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. మండంలోని పొలమూరులో బుధవారం జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ఈ చట్టానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడం అన్యాయమన్నారు. ఏడాదికి 200 రోజుల పని, రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వేసవి అలవెన్సు, మెడికల్ కిట్లు, మజ్జిగ, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పంపన సూర్య నారాయణ, పిల్లి రాజారావు, కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపవరం : ఉపాధి హామీలో రెండు పూటలా మస్తరు విధానం రద్దుచేయాలని సిపిఎం మండల కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం. పిప్పర, వెంకట్రాజపురంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ వద్ద ధర్నా

భీమవరం: ఉపాధి హామీ చట్టంలో ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా జరుగుతున్న మస్తర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 12న భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, బాతిరెడ్డి జార్జి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీకి నిధులు పెంచాలని, రెండు పూటలా పని విధానం రద్దు చేయాలన్నారు. ఈ ధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ ధర్నాలో ఉపాధి హామీ కూలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు


గణపవరం మండలంలో..

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తాం

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రైతులకు అండగా ఉండి, రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం తణుకు మండలం తేతలి, కొండయ్యపాలెం, మండపాక గ్రామాల్లో రైతుల కల్లాల్లోని ధాన్యాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డితో కలిసి మంత్రి కాకాని గోవర్ధన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ రైతులు ఎటువంటి ఇబ్బందీ పడకుండా అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. పొలంలో ఉన్న పంటకు నష్టం జరిగితే సబ్సిడీ చెల్లించడం జరుగుతుందన్నారు. రైతుల గురించి తెలియని ప్రతిపక్ష నాయకులు కూడా ఈరోజు రైతుల గురించి మాట్లాడుతున్నారన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. అనంతరం మండపాకలో ఆర్‌బికెను మంత్రులు సందర్శించారు. ఆర్‌బికెలో రైతుల నుంచి సేకరించిన ధాన్యం నమూనాలను, పంపిణీకి సిద్ధంగా ఉంచిన గోనె సంచులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.భరణి ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శివరామప్రసాద్, ఆర్టికల్చర్ అధికారి దుర్గేష్, తహశీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు

నూక పేరుతో మోసాలను అరికట్టాలని ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు, బ్రోకర్లు నూకశాతం పేరుతో కౌలురైతులను మోసం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మండలంలో వల్లూరులో కౌలు రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ నూకశాతం పేరుతో మిల్లర్లు రైతులను అడ్డంగా దోచుకుంటున్నారన్నారు. అధికారులు నూకశాతం కింద మిల్లర్లకు జిల్లాలో ఇతర రకాలతో పాటు 1121కి కూడా సంచితో కలిపి 40 కేజీల సార బస్తాకు 2 కేజీ లు కలిపి రైతులు ఇవ్వాలని నిర్ణయించడం దారుణమన్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలో 41 కేజీలే పట్టేలా నిర్ణయించామన్నారు. తేమశాతం రైతుభరోసా కేంద్రంలో వచ్చిందే ఫైనల్ చేయాలన్నారు. రైతుల వద్ద అక్రమంగా డబ్బులు కట్టించుకునే మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతులు బొళ్ల సుబ్బారావు, ముసునూరు రాజు, కాండ్రేగుల నాగేశ్వరరావు, కండవల్లి సామ్యూల్, మిద్దే సత్యనారాయణ, బొళ్ల శ్రీనివాసు, కాసాని చినసత్యనారాయణ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

యలమంచిలి : ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు, బ్రోకర్లు కౌలు రైతులను మోసం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కాంబొట్లపాలెం గ్రామంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ నూకశాతం పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇక నుంచి 40 కేజీల సార బస్తాకు కేజీ కలిపి రైతులు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. అయితే యలమంచిలి మండలంలోని కాంబొట్లపాలెం తదితర గ్రామాల్లో 2 కేజీలు అదనంగా పట్టి 43 కేజీలు తూస్తున్నారన్నారు. ఈ సమస్యపై వ్యవసాయ అధికారులతో మాట్లాడగా ఏ రకం ధాన్యం అయినా సంచితో కలిపి 42 కేజీలు మాత్రమే పట్టాలని ఎవరైనా అదనంగా పడితే చర్యలు తీసుకుంటామని 43 కేజీలు పట్టిన ధాన్యం నుండి కేజీ రైతు పేరున కలిపేస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనలో రైతులు కె.సింహాచలం, బండి చంద్రశేఖర్, బదరీ నారాయణ, పితాని గోవర్ధన్, శీలం వెంకట సత్యనారాయణ, అప్పారి జవహార్ పాల్గొన్నారు.

సకాలంలో అభివృద్ధి పనులు చేపట్టాలి

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మంజూరైన నిధులతో ఎక్కడా నాణ్యత తగ్గకుండా సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి మైలాబత్తుల సోనీ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రస్తుత వాతావరణం అనువైందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలంలో పెండింగ్‌లో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, నాడు - నేడు పాఠశాల అభివృద్ధి, రహదారుల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేసి సకాలంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించుకుని 85 శాతం పూర్తిచేసుకుని రాష్ట్రంలోనే నరసాపురం నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన పనులను కూడా సకాలంలో పూర్తి చేసి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో శివారు ప్రాంత ప్రజలకు పుష్కలంగా స్వచ్ఛమైన తాగునీరందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశాలు నిర్వహించేటప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరు లేకుండా ఎంపిడిఒ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంత ముఖ్యమైన సమావేశానికి హాజరు కాకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుతాళ్లులో పిండివారిమెరక ప్రాంతంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులున్నాయని జెడ్‌పిటిసి సభ్యులు బొక్కా రాధాకృష్ణ, శాసన సభ్యులు దృష్టికి తీసుకురాగా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారిని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు సభ్యులు బొక్కా.రాధాకృష్ణ, వైస్‌ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, ఎంపిడిఒ ఎన్‌విఎస్.ప్రసాద్ యాదవ్, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, ఎంఇఒ పి.పుష్పరాజ్యం, వ్యవసాయ శాఖ ఎఒ శామ్యూల్ జాన్సన్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం


తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నేతలు

అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలని టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు పంట మునిగింది.. పరిహారం ఇప్పించాలంటూ నిరసన తెలిపి తహశీల్దార్ సుందరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులను హేళన చేస్తూ మాట్లాడడం సరికాదన్నారు. ఒక్క తణుకులోనే ఆయన పర్యటించి అంతా బాగుందనుకుంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇన్సూరెన్స్ కట్టకుండా మోసం చేయడం వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, ఎంపిపి వీరల్లి దుర్గాభవాని, ఎంపిటిసి కడల నెహ్రూ, పీతల సుబ్రహ్మణ్యం, కడలి వాసు, వీరవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకటరామరాజుకు డాక్టరేట్ అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

సంఘ సేవకుడు, దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట రామరాజుకు డాక్టరేట్ రావడం అభినందనీయమని జైభీమ్ పీపుల్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సిరింగుల వెంకటరత్నం అన్నారు. బుధవారం కాళ్లకూరులో డాక్టరేట్ దాట్ల వెంకట్రామరాజుకు సత్కార సభ నిర్వహించారు. కాళ్లకూరులో ట్రస్టు ద్వారా పేదలు, విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించడం, ఏటా వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, మోక్షధామం, అభివృద్ధి పనులు చేసినందుకు ఆయనను డాక్టరేట్ వరించింది. అనంతరం జైభీమ్ పీపుల్స్ జెఎసి సంఘం సభ్యులు దాట్ల వెంకట్రామరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధన కార్యదర్శి ముళ్లగిరి మణికుమార్, జిల్లా నాయకులు తాళ్లూరి రాజ్‌కుమార్, గొల్ల ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

ఉపాధి కూలీలకు మానవత మండల అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు (కలిసిపూడి రాము) ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని కలిసిపూడి గ్రామంలో పంట కాలువలు, బోదెలను శుభ్రం చేసే ఉపాధి కూలీలకు కలిసిపూడి ఎంపిటిసి, మానవత మండల అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు ప్రథమ చికిత్సకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర రావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు పనిచేసే ప్రదేశంలో గాజు పెంకులు, సీసా పెంకుల వల్ల ప్రమాదానికి గురైతే వెంటనే చికిత్స చేయడానికి ప్రతి ఒక్కరికీ అవసరమైన సామగ్రిని అందించడం జరిగిందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ప్రథమ చికిత్స చేయడం ద్వారా కొంతమేర రోగికి ఉపశమనం కలిగించవచ్చున్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీకి సహకరించిన మెడికల్ షాప్ యజమాని ప్రదీప్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.




నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అనిల్ కుమార్

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బహుజన సమైక్య సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంఘం వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య అన్నారు. కాళ్లకూరులో నిరుపేదలు, ఏ ఆధారం లేని వికలాంగుల దంపతులకు సంఘం జిల్లా కార్యదర్శి జి.అనిల్ కుమార్ రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.రంజిత్, పాస్టర్ అహరోను, జి.సందీప్, టి.రాజ్ కుమార్, జి.ఆశీర్వాదం, పి.యోహాను, బి.దానియేలు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు

ఉండిలో భారీ అన్న సమారాధన

ఉండి: ఉండి గ్రామదేవతలు పోలేరమ్మ, మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం సందర్భంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఛైర్మన్ చిక్కాల జగదీష్‌ప్రసాద్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ అడబాల బాబూరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజును ఆలయ కమిటీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవార్ల కరుణాకటాక్షాలు గ్రామంపై ఉండాలని, ప్రజలు ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. అన్నసమారాధనలో ఐదు వేల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, ఉపసర్పంచి గొట్టుముక్కల కళ్యాణ వర్మ, వైసిపి సోషల్ మీడియా జిల్లా కో ఇన్‌ఛార్జి పాటూరి శ్రీనివాస దొరబాబు, నాయకులు ఏడిద వెంకటేశ్వరరావు, రణస్థల మహంకాళి, కమతం బెనర్జీ, అంగర రాంబాబు, రాయి సతీష్, కనిగళ్ల బ్రహ్మానందం, మానే వరప్రసాద్, ఏడిద నెహ్రూ, మోపిదేవి కేథారేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత

ఉండి: యోగా ద్వారా ఏకాగ్రత పొందొచ్చని ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యోగా ఉపాధ్యాయురాలు విశ్వజ్యోతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం ఉండి శాఖా గ్రంథాలయ అధికారి జెవి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో యోగాభ్యాసాలను విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా విశ్వజ్యోతి మాట్లాడుతూ యోగా ద్వారా ఏకాగ్రత పొందవచ్చన్నారు. యోగా ద్వారా రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుందన్నారు. అనంతరం ప్రయివేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.దీక్షిత్‌కుమార్ విద్యార్థులకు గణిత సూత్రాల ద్వారా తేలికగా గణిత సమస్యలను ఏ విధంగా సాధించవచ్చని తెలిపారు.

విద్యుత్ కోతలు అరికట్టాలి : సిపిఎం

పోడూరు: వేళా పాళా లేని విద్యుత్ కోతలను అరికట్టాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి.ప్రసాద్ బొంతు శ్రీను బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమయం సందర్భం లేకుండా కరెంటు వాడకంలో కోతలు విధించడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురౌతురని పేర్కొన్నారు. కాఫీ హోటళ్ల వ్యాపారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజుకు నాలుగైదు గంటలు విద్యుత్ కోత విధించడం సరికాదని తెలిపారు. కరెంటు కోత అరికట్టకపోతే ప్రజలను సమీకరించి విద్యుత్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

నరసాపురం టౌన్ : నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 22వ వార్డులో రూ.15 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల కోరిక మేరకు సుమారు 21 గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, బర్రి శంకర్, బుసరపు జయ ప్రకాష్, పప్పుల రామారావు పాల్గొన్నారు.

రొయ్యల లోడ్ లారీ అపహరణ

నిందితుల అరెస్టు, రూ.4.7 లక్షల నగదు, బైక్ స్వాధీనం

కాళ్ల: పెదమిరంలో ఆర్‌సి ఆక్వా ట్రేడర్స్‌కు చెందిన రొయ్యల సరుకుతో ఉన్న లోడ్‌ను ఏప్రిల్ 30న అపహరించిన నిందితులను పట్టుకున్నామని జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్ తెలిపారు. కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిఎస్‌పి బి.శ్రీనాథ్ పర్యవేక్షణలో ఆకివీడు సిఐ ఎం.గీతారామకృష్ణ, భీమవరం క్రైమ్ సిఐ ఆకుల రఘురాం, కాళ్ల ఎస్ఐ ఇజిఎస్ మూర్తి, భీమవరం క్రైమ్ పార్టీ ఎస్ఐ రెహమాన్, క్రైమ్ పార్టీ ఎస్ఐ ఆదినారాయణ, పోలీస్ సహకారంతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల పదిన చిన్ను లక్ష్మీ గణపతి, మద్ది సాగర్ రెడ్డిని మొగల్తూరు గాంధీ బొమ్మ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద వదిలిపెట్టిన ఎపి 39వి రొయ్యల లారీని స్వాధీనపర్చుకున్నామన్నారు. ఎస్.కె మస్తాన్ వలీ, మక్కెళ్ల ఏడుకొండలు వారందరూ కలిసి దొంగతానికి పాల్పడ్డారని తెలిపారు. వారి నుంచి రూ.4.7 లక్షల నగదు, ఒక పల్సర్ బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆచంటలో ఫైర్ స్టేషన్ కలేనా..!

నేతల హామీలు గాలికి - స్థానికుల అవస్థలు

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు హామీలకే పరిమితమైంది. సార్వత్రిక ఎన్నికల సందర్భాల్లో నాయకులు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీలు గుప్పించి గెలుపొందారు. అనంతరం ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. ఈ నేపథ్యంలో ఏటా ఆస్తి, ప్రాణ నష్టం తప్పడం లేదు. ఆచంట నియోజకవర్గంలో ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని పాలకొల్లు పట్టణం నుంచి ఫైరింజన్ రావాల్సి వస్తోంది. తీరా ఫైరింజన్ ఇక్కడికి చేరుకునే సరికి అగ్నిప్రమాదం కారణంగా నష్టం జరిగిపోతోంది. సదరు బాధితులు భారీగా ఆస్తి నష్టపోతున్నారు. పలుమార్లు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. గోదావరి తీర ప్రాంతమైన ఆచంట నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి కుటుంబాలు అత్యధికం. వీరిలో అధిక శాతం ప్రజలు తాటాకిల్లు, పెంకుటిళ్లల్లో నివాసముంటున్నారు. సుమారు 2 వేల కుటుంబాల వారు తాటాకిళ్లల్లో, 3 వేల కుటుంబాల వారు పెంకుటిళ్లల్లో నివాసం ఉంటున్నట్లు సమాచారం. ఆయా పరిసర ప్రాంతాల్లో ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అగ్ని ప్రమాదం సంభవిస్తే జరిగే నష్టం అంతా ఇంతా కాదు. కట్టుబట్టలతో రోడ్డున పడాల్సిన పరిస్థితి. నియోజకవర్గంలో గోదావరి మధ్య ఉన్న లంక గ్రామాలైన అయోధ్యలంక, పుచ్చలంక, కోడేరు, పల్లిపాలెం లంక గ్రామాల పరిస్థితి అయితే చెప్పనవసరం లేదు. గోదావరి మధ్యన నివాసం ఉండే అయోధ్యలంక గ్రామాలకు ఫైరింజన్లు వెళ్లలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో లంక గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే సర్వం కోల్పోవాల్సిందే. ఆస్తి, ప్రాణ నష్టాలు సంగతి అటు ఉంచితే ఒక్కోసారి పంటలు కూడా అగ్నికి ఆహుతవుతున్నాయి.



ఇటీవల అగ్నికి ఆహుతైన తాటాకిల్లు

హామీల పర్వం..

ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ఆనాటి ఎంఎల్ఎలు మోచర్ల జోహార్వతి, మాజీ మంత్రులు కొత్తపల్లి సుబ్బారాయుడు, పితాని సత్యనారాయణ, పీతల సుజాత హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఉండి

వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అన్నారు. బుధవారం యండగండి గ్రామంలోని శాఖా గ్రంథాలయాన్ని శేఖర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో ఏర్పాట్ల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ వాడడం వల్ల కంటి చూపుపై ప్రభావం ఎక్కువగా పడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించే అలవాటు చేసుకోవాలన్నారు. జూన్ 11వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్.రామకృష్ణ పాల్గొన్నారు.

హెచ్ఆర్ఎ పెంపుపై ఉద్యోగుల హర్షం

ప్రజాశక్తి - భీమవరం

ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర జిల్లా నాయకత్వ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై 63 రోజుల పాటు అలుపెరగని పోరాటం ఫలితంగా జిల్లా కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు హెచ్ఆర్ఎను ప్రభుత్వం 12 శాతం నుంచి 16 శాతం పెంచిందని ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ ఎస్.శివశంకర్, ఆర్ఎస్ఎ జిల్లా కార్యదర్శి ప్రసాద్‌రాజు, ఆర్ఎస్ఎ కలెక్టరేట్ కార్యాలయ ఛైర్మన్ వై.దుర్గకిషోర్, జాయింట్ సెక్రటరీ వివి. పెద్దిరాజు తెలిపారు. బుధవారం సంయుక్తంగా వారు ఒక ప్రకటన విడుదల చేశారు. జిఓఎంఎస్ నంబరు 69 ద్వారా కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యగులకు హెచ్ఆర్ఎ పెంచడం పట్ల కలెక్టరేట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. తక్షణం మిగతా డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పాలకొల్లు :9 జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్ఆర్ఎ పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల పాలకొల్లు ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు గుడాల హరిబాబు హర్షం వ్యక్తం చేశారు. 12 శాతం నుంచి 16 శాతానికి హెచ్ఆర్ఎ పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలో 9 కొత్త జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పినట్లు చెప్పారు. అయితే జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న వారి హెచ్ఆర్ఎ 20 శాతానికి, మిగిలిన వారికి 16 శాతం ఉండాలని ఆయన కోరారు. 108 సిబ్బందికి 4 నెలల నుంచి జీతాలు లేవని వీరికి వెంటనే జీతాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్‌బికె నిర్వాకం.. కౌలురైతుకు నష్టం

ప్రజాశక్తి - వీరవాసరం

ఆర్‌బికె సిబ్బంది నిర్వాకం వల్ల కౌలు రైతులు నష్టపోతున్న సంఘటన మండలంలోని ఉత్తరపాలెంలో చోటుచేసుకుంది. ఈ విషయం ఎడి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైనట్లు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు బుధవారం తెలిపారు. నిర్దేశించిన తేమశాతం ఉన్నా ధాన్యం తూకంలో కోత విధించేందుకు కౌలు రైతును ఒత్తిడి చేసినట్లు తెలిపారు. విషయాన్ని కౌలురైతు మానుకొండ శ్రీనుబాబు సుబ్బరాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళితే ఆమె అందుబాటులో లేదన్నారు. దీంతో ఎడి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకోవాల్సి వచ్చిందన్నారు. అదే విధంగా పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెరువు ఆర్‌బికె పరిధిలో కూడా కౌలు రైతు మోసానికి గురవుతున్నట్టు ఆయన తెలిపారు. ఆర్‌బికె సిబ్బంది మిల్లర్లతో చేతుల కలిపి కౌలు రైతులను తేమ, ముక్క పేరుతో మోసం చేస్తున్నారని ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

12న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - యలమంచిలి

ఈ నెల 12న ఉపాధి హామీ కార్మికుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం యలమంచిలి, ఆర్యాపేట, శిరగాలపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి మాట్లాడుతూ ఉపాధి హామీలో కూలీలకు చాలీచాలని వేతనాలిస్తూ, రెండు పూటలా పనిచేయించాలనే ప్రభుత్వ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలిపారు. కూలీలకు రోజు వారీ వేతనాన్ని రూ.600లకు పెంచాలని, ఇటువంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు భీమవరంలో ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాశవరపు సుబ్బారావు, కానేటి బాలరాజు, ఎడ్ల మోహనరావు, పొల్లపల్లి రామకృష్ణ, మల్లుల శ్రీని వాస్ పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

మొగల్తూరు: రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతే దేశానికి వెన్నెముక అని సినీ హీరో సుమన్ అన్నారు. కోమటితిప్ప గ్రామానికి చెందిన సత్తినేని ముత్యాలరావు వివాహానికి బుధవారం ఆయన హాజరయ్యారు. అనంతరం కొత్తట గ్రామానికి చెందిన కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సత్తినేని శ్రీనివాస్ తాతాజీ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కోరేది చాలా తక్కువ అని, ఏ ప్రభుత్వమైనా వారి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని తెలిపారు. కరోనా సమయంలో దేశంలోని ప్రజలకు అన్నం పెట్టింది అన్నదాతనేని తెలిపారు. కార్యక్రమంలో గట్టెం శ్రీనివాస్ సత్తినేని విజయ భాస్కరరావు, రాజు, చొడగం ఏడుకొండలు, ఆకుల శ్రీనివాసరావు, వలవల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: ఎంఎల్ఎ నిమ్మల

పోడూరు: పెనుమదం గ్రామంలో వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా ఎక్కడ చూసినా కూడా రోడ్ల వెంబడి ధాన్యం రాశులు ఉన్నాయని, రైతును అడుగుతుంటే లబోదిబోమంటున్నారని తెలిపారు. కష్టపడి పగలనకా రాత్రనకా పంట పండించి తక్కువకు ఎందుకు ఇవ్వాలని రైతులు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఈ సొమ్మంతా తాడేపల్లి రాజప్రసాదం లోకి పోతోందన్నారు. ముఖ్యమంత్రి వీటిపై సమాధానం చెప్పి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం రైతుల తరపున కలెక్టర్ ఆఫీస్ వద్ద రైతు పోరుబాట జరుగుతుందని, నష్టపోయిన ప్రతి రైతూ కలెక్టరేట్‌కు తరలిరావాలన్నారు.

గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : పివిఎల్

ఉండి: గ్రామావృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. బుధవారం కలిగొట్ల సచివాలయ పరిధిలోని ఆరేడులో మూడో రోజు నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న పివిఎల్ నరసింహరాజు దృష్టికి గ్రామస్తులు సమస్యలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల గురించి తెలుసుకోవడానికి గ్రామాల్లో పర్యటిస్తున్నానని తెలిపారు. గ్రామంలో ప్రధానంగా డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జానపద సృజనాత్మక కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, గ్రామ సర్పంచి కట్రెడ్డి బ్రహ్మానందం పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

జల జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఎం గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వేల్పూరులో స్థానిక సాలిపేటలో జరుగుతున్న జల జీవన్ మిషన్ పనులను సిపిఎం ఆధ్వర్యంలో పార్టీ శాఖా కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్ల పునరుద్ధరణ, రక్షిత నీటి సరఫరా పథకం అభివృద్ధి చేసేందుకు రూ.274.59 లక్షలతో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నామని చెప్పి, ప్రస్తుతం కుళాయిల ద్వారా పంచాయతీ వారు ఇస్తున్న నీటి సరఫరాను నిలిపివేసి అనంతరం పనులు ప్రారంభించారని తెలిపారు. ప్రతి వీధిలో పైపులైను వేయడానికి గోతులు తవ్వి 4 నుండి 5 మాసాలు కావస్తున్నప్పటికీ గోతుల్లో పైపులు పెట్టి పూడిక చేయకపోవడం, మరికొన్ని చోట్ల పైపులు పెట్టకపోవడంతో తాగునీటి సమస్యతో ప్రజలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సాలిపేటలో పుంతలో ముసలమ్మ గుడి వద్ద వందేళ్ల చరిత్ర కలిగిన చెట్టు చుట్టూ పైపులైను కోసం తవ్వేశారని, అయితే గోతులు పూడ్చకపోవడం వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వృక్షం నేలకొరిగిందని తెలిపారు. తక్షణం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు.

రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - యలమంచిలి

ఉపాధి హామీలో రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 12న ఉపాధి హామీ కార్మికుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏనుగువానిలంక, కలగంపూడి, ఊటాడ సంఘటరేవు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ ఉపాధి హామీలో కూలీలకు చాలీచాలని వేతనాలిస్తూ, రెండు పూటలా పని చేయించాలనే ప్రభుత్వ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, రోజు వారి వేతనాన్ని రూ.600లకు పెంచాలని తెలిపారు. సమస్యలను ప్రభుత్వానికి తెలియజెపేందుకే భీమవరం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలంతా పెద్ద ఎత్తున పాల్గొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాశవరపు సుబ్బారావు, కానేటి బాలరాజు, యడ్ల మోహనరావు, పొల్లపల్లి రామకృష్ణ, మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకోడేరు: వ్యవసాయ, ఉపాధి కూలీలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే అభివృద్ధి ముందుకు సాగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. పెన్నాడలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని గోపాలన్ బుధవారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం దేశవ్యాప్తంగా అమలు జరుగుతోందన్నారు. అయితే గ్రామాల్లో మార్పులు వచ్చాక పనులు తగ్గాయన్నారు. ఆక్వా, రియల్ ఎస్టేట్, వ్యవసాయంలో యంత్రాలు వచ్చిన తర్వాత పనులు మరింత తగ్గాయన్నారు. మహిళలకు, వయసు పైబడిన వారికి పనులు దొరకడం కష్టంగా మారిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. ఉపాధి బడ్జెట్లో రూ.30 వేల కోట్లు తగ్గించి రూ.60 వేల కోట్లకు కుదించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించడంతోపాటు రూ.600 వేతనాన్ని అందించాలన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 12న భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గోపాలన్ వెంట సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ్య, అప్పలరాజు, సత్యవతి, ఉపాధి కూలీలు, మహిళలు ఉన్నారు.

నరసాపురం టౌన్ : ఉపాధి హామీ పథకంలో కూలీలకు నష్టం కలిగించే ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. బుధవారం వేములదీవి పడమర, దర్భరేవు గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో సంఘం నాయకులు పర్యటించి కూలీల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు, మత్స్యకారులు మత్స్యకార్మిక సంఘం నాయకులు జల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వేసవి సెలవుల్లో కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు పాఠశాలలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అమలు చేస్తున్నట్లు హెచ్ఎం రాయపూడి ప్రసాద్ తెలిపారు. ఒక్కో విద్యార్థికి నాలుగు చొప్పున (3 నుంచి ఐదో తరగతి వరకూ) గ్రంథాలయ పుస్తకాలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ డి.రాంబాబు మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల్లో గ్రంథాలయ పుస్తకాలను తల్లిదండ్రుల వద్ద విద్యార్థులు బిగ్గరగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్ కొత్తల వెంకటకుమారి, పట్టణ ఎస్ఐ సానబోయిన ముత్యాలరావు, ఎస్‌వి.రంగారావు పాల్గొన్నారు.

అరుణాచలం యాత్రకు మరిన్ని ఆర్‌టిసి సర్వీసులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మూడు నెలలుగా ఎపిఎస్ ఆర్‌టిసి నడిపిన అరుణాచలం స్పెషల్ బస్సులకు యాత్రికుల నుంచి విశేష స్పందన రావడం, వారి కోరిక మేరకు మరిన్ని సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమికి ముందు రోజు జిల్లాలోని నాలుగు డిపోల నుండి బస్సులు బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం చేరుకొని గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి వస్తాయని తెలిపారు. యాత్రలో ప్రయాణికుల విశ్రాంతి, ఇతర అవసరాల కోసం చక్కటి సదుపాయాలున్న చోట అధికారులు సమన్వయంతో వసతి కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు హైటెక్ వీడియో కోచ్ బస్సులు, క్రమశిక్షణ, అనుభవం కలిగిన సిబ్బందిని పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మొగల్తూరులో చలివేంద్రం ఏర్పాటు

మొగల్తూరు : మొగల్తూరులోని పాతకాలవ సెంటర్లో ఎన్‌టిఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో యంగ్ టైగర్ ఎన్‌టిఆర్ అభిమానులు బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని అభిమానులు తెలిపారు.